వెబ్ కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పించాలి

నేరేడ్‌మెట్, అక్టోబర్ 25: నేరేడ్‌మెట్‌లోని డైట్ కళాశాలలో ప్రవేశానికి వెబ్ కౌన్సెలింగ్‌కు అవకాశం కల్పించాలని గెస్ట్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి కస్తూరి రవీందర్ కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థలు, ప్రైవేటు కళాశాలల్లో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సులో ప్రవేశానికి జూలై 10వ తేదీన డీసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించారు. ఈనెల 23వ తేదీ నుంచి వెబ్ కౌన్సెలింగ్ కన్వీనర్ ప్రకటించిన అనుమతి పొందిన కళాశాలల జాబితాల్లో 9 జిల్లాలకు చెందిన 9 ప్రభుత్వ డైట్, ప్రైవేటు కళాశాల పేర్లు మాత్రమే ఉన్నాయని. కాగా హైదరాబాద్ నేరేడ్‌మెట్ కు చెందిన ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ పేరు లేకపోవడం దారుణమన్నారు. ఏ ఒక్క ప్రైవేటు కళాశాల పేరు కూడా లేదని పేర్కొన్నారు. 60 సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న నేరేడ్‌మెట్ ఉపాధ్యాయ శిక్షణ సంస్థను ప్రభుత్వం తన రాజకీయ లబ్ధికోసం మూసివేసే కుట్ర చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరామ్, విద్యావేత్తలు వెంటనే స్పందించి అభ్యర్థులకు వెబ్ ఆప్షన్ ద్వారా కళాశాలను ఎంపిక చేసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

రూ.10వేల పింఛన్ అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న మురళీధరన్

చిక్కడపల్లి,అక్టోబర్25 : దేశ వ్యాప్తంగా దివ్యాంగులకు రూ. 10 వేల పింఛన్ అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీ ధరన్ డిమాండ్ చేశారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర 4వ మహాసభలు శుక్రవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మురళీ ధరన్ మాట్లాడుతూ దివ్యాంగులకు దేశ వ్యాప్త ఏకీకృత పెన్షన్ సాధన కోసం ఫిబ్రవరి 10న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, ఎన్‌పీఆర్‌డీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నంభు రాజన్, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకట్, అడివయ్య, హెలెన్ కెల్లర్ విద్యాసంస్థల చైర్మన్ ఉమర్ ఖాన్, నాగేందర్, ఇమద్ ఖాన్, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, ఉపాధ్యక్షురాలు జ్యోతి, శ్రీనివాస్, స్కైలాబ్ బాబు పాల్గొన్నారు.

గండిపేట్ కాండూట్‌కు మరమ్మతులు

కెమికల్ ట్రీట్‌మెంట్ పద్ధతిలో రిపేర్లు

షట్‌డౌన్ లేకుండానే పనులు

పర్యవేక్షించిన జలమండలి ఎండీ

సిటీబ్యూరో, అక్టోబరు 25 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ నగరంలో గండిపేట్ కాండూట్‌ను వేధిస్తున్న లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. లీకేజీకి చెక్ పెట్టేందుకు జలమండలి సిద్ధమైంది. కాండూట్‌కు ఏర్పడిన లీకేజీని అరికట్టేందుకు మరమ్మతు పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు పనులను ఎండీ అశోక్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ గండిపేట్ కాండూట్‌కి గండిపేట్, కోకాపేట్, మణికొండ, సీబీఐటీ కళాశాల, పుప్పాలగూడ, జానకీ నగర్, కౌసర్ కాలనీ, ఎంఈఎస్ క్యాంపస్ తదితర ప్రాంతాల్లో లీకేజీలు ఏర్పడ్డాయి. అయితే ఈ లీకేజీలను అరికట్టడానికి మరమ్మతులు చేపడితే.. నీటి సరఫరాలో నెల రోజుల పాటు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ఈ పనులను వాయిదా వేస్తూ వస్తున్నారు. నీటి సరఫరాకు ఆటంకం కాకుండా.. రిపేర్లు చేసే టెక్నాలజీలను అన్వేషించి.. ఎట్టకేలకు చెన్నైకి సంబంధించిన కంపెనీ జర్మన్ టెక్నాలజీతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా లీకేజీలు అరికడుతామని ముందుకొచ్చింది. 40 రోజుల కింద ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్ వద్ద కాండూట్‌కి 10 మీటర్ల మేరకు గ్రౌటింగ్ ద్వారా మరమ్మతులు ప్రయోగాత్మకంగా చేపట్టి.. విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో మిగతా ప్రాంతాల్లోనూ పనులు పూర్తి చేయాలని ఎండీ అధికారులకు సూచించారు.

నీటి సరఫరా సమయంలోనే ..

వాటర్ షట్ డౌన్ తీసుకుంటే.. వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారులు కెమికల్ ట్రీట్ మెంట్ పద్ధతిని ఉపయోగించి మరమ్మతులు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. లీకేజీ ఏర్పడిన ప్రాంతంలో మొదటగా ప్రత్యేక పరికరాలతో నీటిని ఖాళీ చేసి.. ఆ ప్రదేశంలోకి ప్రత్యేకమైన రసాయనాన్ని పంపిస్తారన్నారు.. క్షణాల్లో ఆ రసాయనం ఘనపదార్థంగా మారి, ఖాళీ ప్రాంతాల్లో పూడుకుపోయి లీకేజీ ఆగిపోతుందన్నారు. ఈ పద్ధతి ద్వారా నీటి సరఫరా నిలిపివేయకుండానే.. మరమ్మతు పనులు నిర్వహించవచ్చని అధికారులు పేర్కొన్నారు.

8 ఎంజీడీల వృథాకు చెక్ ..

గండిపేట్ నుంచి నగరానికి మొత్తం 26 ఎంజీడీల తాగునీరు సరఫరా చేసే సామర్థ్యం ఉంది. కాగా ప్రస్తుతం 20 ఎంజీడీలు సరఫరా చేస్తే, అందులో దాదాపు 8 ఎంజీడీల నీరు ఈ లీకేజీల వల్ల వృథా అవుతుంది. చివరికి 12 ఎంజీడీలు మాత్రమే వినియోగదారులకు సరఫరా అవుతున్నాయి. ఈ లీకేజీ సమస్య దాదాపు 14.5 కిలో మీటర్ల మేర 45 ప్రాంతాల్లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎండీ అశోక్ రెడ్డి సరఫరాపై ప్రభావం పడకుండా మరమ్మతు నిర్వహణ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రిపేర్ పూర్తయితే.. మరో 14 ఎంజీడీల నీరు వినియోగదారులకు సరఫరా చేయవచ్చని అధికారులు చెప్పారు. కాగా గండిపేట్ నుంచి ఆసిఫ్ నగర్ ఫిల్టర్ బెడ్ వరకు మొత్తం నీటి సరఫరా గ్రావిటీ ద్వారానే జరుగుతుంది. ఒక్క రూపాయి కూడా ఖర్చు కాదు. ఫిల్టర్ బెడ్‌లో నీటి శుద్ధి అనంతరం.. వినియోగదారులకు నీటి సరఫరా జరుగుతుంది. 1920లో అప్పటి నిజాం ఉస్మాన్ అలీ ఖాన్.. హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం నిర్మించిన ఈ రిజర్వాయర్ నుంచి జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నంబర్ – 4, 5, 6 పరిధిలో వినియోగదారులకు దీని ద్వారా తాగునీరు సరఫరా అందిస్తున్నారు. సీజీఎం రవీందర్ రెడ్డి, ట్రాన్స్ మిషన్ అధికారులు ఉన్నారు.

పోలో రైడింగ్ క్లబ్ సందర్శన



పోలో రైడింగ్ క్లబ్‌ను సందర్శిస్తున్న జగదాంబిక పాల్

హైదరాబాద్, ఆట ప్రతినిధి అక్టోబర్ 25 : అజీజ్‌నగర్‌లోని హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్ (హెచ్‌పీఆర్‌సీ)ని శుక్రవారం ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి జగదాంబిక పాల్ సందర్శించారు. ప్రస్తుత లోక్‌సభ సభ్యుడు జగదాంబిక పాల్‌కు హైదరాబాద్ పోలో రైడింగ్ క్లబ్ (హెచ్‌పీఆర్‌సీ) అధ్యక్షుడు చైతన్య ఆర్.కుమార్‌తో పాటు క్లబ్ ఆఫీస్ బేరర్లు స్వాగతం పలికారు. రైడింగ్ అరేనాలు, స్విమ్మింగ్ పూల్, బ్యాడ్మింటన్, స్క్వాష్ కాంప్లెక్స్‌లను సందర్శించిన అనంతరం పాల్ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన ఈ క్లబ్‌కు తన సహకారం అందజేస్తానని తెలిపారు. వ్యవస్థాపక సభ్యుడు బజరంగ్ షా, ఇండియా ఎడిటర్ మహ్మద్ శంషుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పశుగణన ప్రారంభం

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్ గౌతమ్

మేడ్చల్, అక్టోబర్25(నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వ పాడి పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్ శుక్రవారం ప్రారంభించారు. నాలుగు నెలల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పాడి పశువులు, గొర్రెలు, మేకలు, గుర్రాలు, కుక్కలు, కోళ్లు ఇలా 16 రకాల జంతువుల లెక్కను పక్కాగా సేకరించనున్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అధికారి సుధాకర్, సహాయ సంచాలకుడు ప్రభు రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్త పైప్‌లైన్‌తో ముంపు సమస్యకు చెక్

సిటీబ్యూరో, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ): వరదముంపును ఎదుర్కొంటున్న లక్డీకాపూల్ ప్రాంతంలో శిథిలమైన వరదనీటి పైప్‌లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్లు నిర్మించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. శుక్రవారం నగరంలోని లక్డీకాపూల్ ప్రాంతంలో వరదముప్పు ప్రాంతాన్ని, ట్రాఫిక్ సమస్యలకు కారణమైన కాలువలను ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు స్థానికులతో మాట్లాడుతూ వర్షాలు కురిసినప్పుడు వచ్చే వరద వల్ల ఎక్కడ వాటర్ లాగింగ్ జరుగుతుందో చర్చించారు. ఈ సందర్భంగా మెట్రోపిల్లర్ వద్ద శిథిలమైన పైప్‌లైన్ గురించి స్థానికులు వివరించారు. జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడిన రంగనాథ్ యుద్ధప్రాతిపదికన కొత్తగా పైప్‌లైన్లను నిర్మించాలని, వారంరోజుల్లోగా పనులు ప్రారంభిస్తే ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా ఒకట్రెండు రోజుల్లో పనులు పూర్తిచేయవచ్చని చెప్పారు. 30 ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి వచ్చే వర్షాకాలానికి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడటానికి చర్చించారు.

లక్డీకాపూల్ వద్ద శిథిలమైన పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నిరసన చేస్తున్న ఉద్యోగులు

స్థలం కేటాయింపు విరమించుకోవాలి

బంజారాహిల్స్, అక్టోబర్ 25: డా.బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి సంబంధించిన 10 ఎకరాల స్థలాన్ని జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి కేటాయించాలనే ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేస్తూ యూనివర్సిటీకి చెందిన జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం కొనసాగుతుంది. శుక్రవారం యూనివర్సిటీకి చెందిన అధ్యాపక, అధ్యాపకేతర, టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్, టైంస్కేల్, కాంట్రాక్టు ఉద్యోగులంతా మధ్యాహ్న భోజన సమయంలో పరిపాలన భవనం ఎదుట బైఠాయించారు. ఉద్యోగుల జేఏసీ చైర్ పర్సన్ ప్రొ.పల్లవి కాబ్డే, కన్వీనర్ ప్రొ.వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ మహేశ్వర్‌గౌడ్, జేఏసీ నేతలు డా.యాకేశ్ దైద, ప్రేమ్‌కుమార్, రవీంద్రనాథ్ సోలమన్, డా.ఎల్‌కేవీ.రెడ్డి, హబీబుద్దీన్, రజినీకాంత్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ వేదికగా నిర్వహిస్తున్న స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరుస్తున్నారు. రెండో రోజైన మీట్‌లో శుక్రవారం నిర్వహించిన బాలుర స్కేటింగ్ అండర్-9 విభాగంలో మిథుల్ స్వర్ణం దక్కించుకోగా, బాలికల కేటగిరీలో అర్వి అగ్రస్థానంలో నిలిచింది. బాలుర అండర్-11లో ప్రత్విక్, బాలికల కేటగిరీలో వశిక్ష పసిడి పతకాలు కైవసం చేసుకున్నారు. మిగతా విభాగాల్లో రోహన్‌రెడ్డి, తేజ, సియా విజేతలుగా నిలిచారు.

సెగ్రిగేషన్ అద్భుతం

బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుపై ప్రశంసలు

వట్టినాగులపల్లిలోని చెత్త డంపింగ్ కేంద్రంలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ల బృందం

మణికొండ, అక్టోబర్ 25: నగర శివారు ప్రాంతంలోని మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల చెత్త సేకరణ పనితీరు, ప్రాసెసింగ్ విధానం అద్భుతమని మున్సిపాలిటీల కమిషనర్ల బృందం కితాబిచ్చారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్(సీడీఎంఏ) ఆదేశాల మేరకు వట్టినాగులపల్లిలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌ను షాద్‌నగర్, శంకర్‌పల్లి, తుక్కుగూడ, అమీన్‌పూర్, అందోల్, జోగిపేట్, ఫీర్జాదిగూడ, నిజాంపేట్, తూంకుంట, తూఫ్రాన్ మున్సిపల్ కమిషనర్ల బృందం శుక్రవారం సందర్శించింది. ఈ సందర్భంగా తడి-పొడి చెత్తను ఏ విధంగా వేరు చేసి వాటితో కంపోస్ట్ ఎరువుల తయారీ విధానం, పొడి చెత్తతో వివిధ ఆకృత అలంకార వస్తువుల తయారీ విధానాన్ని చూసిన అధికారులు సంతృప్తి వ్యక్తం పర్చారు. ఇలాంటి సెగ్రిగేషన్ కేంద్రాలను అన్ని మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఇలాంటి ప్రాసెసింగ్ విధానాలను అమలు చేసి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు చర్చించుకున్నారు. కమిషనర్లు నాగమణి, వెంకట్ గోపాల్, త్రిలేశ్వర్, డీఈలు, ఏఈలు శానిటేషన్ అధికారి లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

మహిళా మేజిస్ట్రేట్లకు సన్మానం

నాంపల్లి కోర్టులు, అక్టోబర్ 26 (నమస్తే తెలంగాణ) : నాంపల్లి కోర్టులోని ఐదు కోర్టులకు బదిలీపై వచ్చిన మహిళా మేజిస్ట్రేట్లను శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఆశారాణి (2వ), స్వర్ణలత (4వ), నిర్మల (9వ), అనూష (12వ), సౌమ్య (14వ) కోర్టుల మెజిస్ట్రేట్లను సత్కరించారు. ఈ సందర్భంగా 2వ అదనపు జిల్లా జడ్జి వినోద్‌కుమార్, 3వ అదనపు జిల్లా జడ్జి మైత్రేయి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ 41-ఏ అమలు నాటి నుంచి క్రిమినల్ ప్రాక్టీసు చేస్తున్న న్యాయవాదులకు ఇబ్బందులు ఎదురయ్యాయని, ఇతర కేసులను వాదించేందుకు వేరే కోర్టులకు వెళుతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, నాంపల్లి కోర్టుల న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అరుణకుమారి, కోశాధికారి లడ్డా, సంయుక్త కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షులు గోకుల్, రామాంజనేయులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులుగా మారుస్తాం

కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

దుండిగల్,అక్టోబర్25: ఇందిరా మహిళా శక్తితో మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ప్రగతినగర్ సమీపంలోని ఎల్‌ఐపీ(అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా)ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన 'ఎంఎస్‌ఎంఈ డిఫెన్స్ కాన్‌క్లేవ్'కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔత్సాహిక మహిళా పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. అంతకు ముందు ఎలీప్ ప్రాంగణంలో నిర్మించిన డిజిటల్ స్టూడియోను ప్రారంభించారు. ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ తెలంగాణ ప్రభుత్వ డైరెక్టర్ డా.ప్రవీణ్,ఎలీప్ అధ్యక్షురాలు రమాదేవి, సెక్రటరీ పద్మజా ప్రభాకర్, ట్రెజరర్ శ్రీమహాలక్ష్మి, డిఫార్ట్‌మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్స్ సలహాదారు సుఖ్‌గీత్‌కౌర్,ప్రభుత్వ పరిశ్రమల శాఖ డైరెక్టర్ డా.మన్నార్,మిధాని సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డా.సంజయ్ కుమార్ ఝా, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొన్నారు.

28 నుంచి హాకా పటాకుల విక్రయాలు

రవీంద్రభారతి,అక్టోబర్ 25: జంటనగరాల వినియోగదారులకు విశేషమైన సేవలు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ హాకా(ది హైదరాబాద్) అగ్రికల్చరల్ కో- ఆపరేటివ్ అసోసియేషన్)ఈ ఏడాది కూడా దీపావళినిపురస్కరించుకొని హాకా పటాకులతో సేవలు అందించాలని నిర్ణయించింది. శివకాశి నుంచి ప్రత్యేకంగా తెప్పించిన స్టాండర్డ్ బ్రాండ్ నాణ్యమైన పటాకులను ఈ నెల 28 నుంచి 31 వరకు ఇందిరా పార్కు ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ స్టేడియంలో 10 స్టాల్స్ ఏర్పాటు చేసి విక్రయించనున్నామని ఎండీ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా గోడౌన్

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా పటాకుల గోడౌన్‌ను నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రూ. 5 లక్షల విలువైన పటాకులను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు డీసీపీ సుదీంద్ర తెలిపారు. మెహిదీపట్నంకు చెందిన శ్రీరామ్ దీపావళి పండుగ సందర్భంగా భారీ ఎత్తున పటాకులు తెచ్చి చింతల్ బస్తీ రోడ్డులోని మెఘల్స్ ఇమామీ మెన్షన్‌లో నిల్వ చేశాడు.

నేటి నుంచి సివిల్స్‌పై సెమినార్

సిటీబ్యూరో, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ) : సివిల్ సర్వీసెస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు రిఫ్లెక్షన్స్ ఐఏఎస్ అకాడమీ సీఎంఆర్ విద్యాసంస్థలలో సెమినార్‌లను నిర్వహిస్తోంది. తెలంగాణ టుడే, నమస్తే తెలంగాణ సౌజన్యంలో అక్టోబర్ 26న సీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, 28న సీఎంఆర్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, 29న సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్, నవంబర్ 5న సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీల్లో ఈ సెమినార్లు జరగనున్నాయి. ఉదయం 11గంటలకు సెమినార్ ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. శనివారం 2014 సివిల్స్ టాపర్ డా. వివేకానంద ప్రారంభోపన్యాసం చేయనున్నారు. సీఎంఆర్ఐటీ డైరెక్టర్ డా. ఎం జంగారెడ్డి, సీఎంఆర్ సెట్ ప్రిన్సిపాల్ డా. వీఏ నారాయణ, సీఎంఆర్ టీసీ డైరెక్టర్ డా. రాజిరెడ్డి, సీఎంఆర్ ఈసీ ప్రిన్సిపాల్ డా. ఏఎస్ రెడ్డి లతోపాటు విద్యావేత్తలు, నిపుణులు కూడా హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

జీవన సాఫల్య పురస్కారం అందజేత

పురస్కారాన్ని అందజేస్తున్న వీసీ ప్రొఫెసర్ నిత్యానందరావు

ఖైరతాబాద్, అక్టోబర్ 25 : రంజనీ తెలుగు సాహితీ సమితి ఆధ్వర్యంలో సైఫాబాద్‌లోని ఏజీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పూర్వ ఉద్యోగులు, సాహితీవేత్తలు పాలకోడేటి సత్యనారాయణ రావు, పీఎస్ఎం లక్ష్మీలకు జీవన సాఫల్య పురస్కారాన్ని ముఖ్య అతిథిగా హాజరైన కాళోజీ తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వెల్దండ నిత్యానందరావు అందజేశారు. అనంతరం రంజనీ దసరా, దీపావళి సంచికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అకౌంటెంట్ జనరల్ మాధవి, పూర్వ ప్రిన్సిపాల్ అకౌంటెంట్ జనరల్స్ సుధీర్ కుమార్, మల్లాది సుబ్రహ్మణ్యం, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్స్ సంజయ్ కామినేని, నరేశ్, రంజనీ అధ్యక్షురాలు నందిరాజు పద్మలతా జయరాం, ఉపాధ్యక్షుడు అద్దేపల్లి రాధాకృష్ణ, పూర్వకార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా శిథిలాల్లో దొంగలు..

ఎర్రకుంటలో భవననిర్మాణ వ్యర్థాలనుంచి ఇనుమును వేరుచేస్తున్న వ్యక్తులు

సిటీబ్యూరో, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ): హైడ్రా కూల్చివేతల నిర్మాణ శిథిలాల వద్ద నిర్మాణ వ్యర్థాలనుంచి ఇనుమును దొంగలు ఎత్తుకుపోతున్నారు. మూడురోజులుగా బాచుపల్లి ఎర్రకుంట చెరువు వద్ద హైడ్రా కూల్చేసిన భవన శిథిలాలను తొలగించే ప్రక్రియ కొనసాగుతుంది. హైడ్రా, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ సిబ్బంది ఈ ప్రక్రియలో పాల్గొంటున్నారు. ఇదే సమయంలో కొందరు డీసీఎంలు తీసుకొచ్చి ఇనుము తీసుకెళ్లడం గమనించిన స్థానిక బిల్డర్ తాను నిర్మిస్తున్న ఇంటిని కూల్చేయడమే కాకుండా అక్కడి శిథిలాల నుంచి ఇనుము తీసుకెళ్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. టన్నుల కొద్ది ఇనుము వస్తుండడంతో ప్రైవేట్ వ్యక్తులు డీసీఎంలు తీసుకొచ్చి మరీ తీసుకెళ్తున్నారు. ఇదంతా హైడ్రా బృందం సహాయంతోనే వారి ప్రోద్బలంతోనే జరుగుతున్నదని బిల్డర్ చెబుతున్నారు.ఈ విషయంలో కమిషనర్ వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ఐరన్‌ను అమ్ముకుంటున్నారు: బిల్డర్

నిజాంపేట్‌లోని ఎర్రకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన మూడు 5అంతస్తుల భవనాలను ఆగస్టు 14న హైడ్రా కూల్చివేసిన విషయం తెలిసిందే. అయితే నిర్మాణ వ్యర్థాలలోని ఐరన్‌ను తీసుకుని ఇతర వ్యర్థాలను అక్కడే వదిలేసి వెళ్లిన నిర్మాణదారుడికి ఈనెల 21న హైడ్రా నోటీసులు ఇచ్చింది. కూల్చివేసిన నిర్మాణంలోని ఐరన్‌ను హైడ్రా సిబ్బంది తీసి అమ్ముకుంటున్నారని బిల్డర్ ఆరోపించాడు.

ఏఐ టూల్స్ అభివృద్ధి

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): దేశం కోసం, భారతీయ సాంకేతిక నిపుణుల చేత దేశంలోని లోని విభిన్న సంస్కృతులు, భాషల కోసం ప్రత్యేకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నమూనాలను రూపొందించడంపై గచ్చిబౌలి ట్రిపుల్ ఐటీ సంస్థ దృష్టి సారించింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్లయిన చాట్ జీపీజీ, గూగుల్ జెమిని తరహాలో దేశంలోని వివిధ ప్రాంతాలు, భాషలను పరిగణలోకి తీసుకొని భారత్‌జెన్ పేరుతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు చేసిన వేదికపై ఏఐ టూల్స్‌ను ట్రిపుల్ ఐటీ విద్యార్థుల బృందం రూపొందిస్తోందని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ పీ.జె.నారాయణన్ తెలిపారు. ఇంగ్లీషు భాషలో రూపొందించిన ఏఐ అప్లికేషన్స్‌ను దేశంలోని ఇతర భాషల్లోకి సులువుగా మార్చుకునేలా వీటిని రూపొందించడం ద్వారా కోట్లాది మంది భారతీయులు వాడుకునే అవకాశం ఉంటుందన్నారు.

జగదీశ్ మార్కెట్లో నకిలీ యాక్ససరీస్

- నలుగురు నిందితుల అరెస్ట్

సిటీబ్యూరో, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): జగదీశ్ మార్కెట్‌లో నకిలీ యాపిల్ ఫోన్ సామగ్రిని విక్రయిస్తున్న నాలుగు దుకాణాలపై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అబిడ్స్ పోలీసులతో కలిసి దాడి చేసి రూ. 2.42 కోట్ల విలువైన నకిలీ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ సుదీంద్ర కథనం ప్రకారం.. జగదీశ్ మార్కెట్లో నింబ్ సింగ్ టార్గెట్ మొబైల్ షాప్, హీర రామ్ పటేల్ మొబైల్ షాప్, గోవింద్ లాల్ చౌహాన్ అశుపురా మొబైల్ షాప్, ముకేశ్ జైన్ నంది మొబైల్స్ దుకాణాలను నిర్వహిస్తున్నారు. సెల్‌ఫోన్‌కు సంబంధించిన వివిధ యాక్ససరీస్‌ను విక్రయిస్తున్నారు, ఇందులో భాగంగా ఆయా యాక్ససరీలస్‌కు యాపిల్ ఫోన్ లోగోలు వేసి, అసలైనవనే భ్రమను కల్పిస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. కాపీ రైట్ ఉల్లంఘనలతో పాటు అమాయకులను మోసం చేస్తున్న వ్యాపారులపై వచ్చిన ఫిర్యాదుతో దాడులు చేయగా భారీ ఎత్తున యాపిల్ పేరుతో ఉన్న నకిలీ ఫోన్ యాక్ససరీస్ బయటపడ్డాయి. నిందితులను అరెస్ట్ చేశారు.

ఛత్ పండుగకు ప్రత్యేక రైళ్లు

హైదరాబాద్, అక్టోబర్ 25(నమస్తే తెలంగాణ): ఛత్ పండుగ సందర్భంగా ఆరు ప్రత్యేక రైళ్లను నడుపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు శుక్రవారం తెలిపారు. ప్రయాణికుల రద్దీ